## క్లుప్తంగా

### ‘కాశీ క్షేత్రం’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

**కర్నూలు కల్చరల్:** ప్రముఖ కవి ఎల్లాల యతిరాజం మీనా నాగేశ్వరరావు రచించిన ‘కాశీ క్షేత్రం’ పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం ఆవోపా సదన్‌లో జరిగింది. సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి సౌజన్యంతో విశ్రాంత తహసీల్దార్ కె.క్రిష్టన్న అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. విశ్రాంత స్పెషల్ కలెక్టర్ రామస్వామి, రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, ఆవోపా అధ్యక్షులు మేడా వెంకట సురేష్, ఏపీ టూరిజం డివిజనల్ మేనేజర్ చంద్రమౌళి రెడ్డి పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో సమితి గౌరవాధ్యక్షులు డాక్టర్ మోక్షేశ్వరుడు, కవులు వీపూరి వెంకటేశ్వర్లు, బోలుగద్దె అనిల్ కుమార్, సమితి సభ్యులు మహాబలేష్, మురళీ కృష్ణ, నాగోజీరావు, దామోదర్‌రెడ్డి, ఎస్వీ నారాయణరెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ముగ్గురు వైద్యుల బదిలీ

**కర్నూలు(హాస్పిటల్):** కర్నూలు మెడికల్ కాలేజీ నుంచి ఆదోని మెడికల్ కాలేజీకి ముగ్గురు వైద్యులు(ప్రొఫెసర్లు) బదిలీ అయ్యారు. ఇందులో జనరల్ మెడిసిన్ నుంచి డాక్టర్ ఎం.మహేశ్వరరెడ్డి, జనరల్ సర్జరీ నుంచి డాక్టర్ టి.మురళీకృష్ణ, గైనకాలజీ నుంచి డాక్టర్ సి.విజయలక్ష్మి ఉన్నారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనల మేరకు ఈ బదిలీలు నిర్వహించినట్లు ఉన్నతాధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### ఇందిరమ్మ రాజ్యం రావాలి

**కర్నూలు(సెంట్రల్):** దేశంలో మళ్లీ ఇందిరమ్మ రాజ్యం రావాలని డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు అన్నారు. బుధవారం ఆయన బుధవారపేటలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జి.రాంపుల్లయ్యయాదవ్, కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి జిలానీబాషాలను గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎల్లమ్మ గుడిలో జిలానీబాషా ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. కాగా కాంగ్రెస్ అభ్యర్థులు హోరేబు చర్చిలో నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం నిర్వహించారు. అలాగే సాయంత్రం ఎంపీ అభ్యర్థి పీజీ రాంపుల్లయ్య యాదవ్ 50, 51 వార్డుల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణగుప్తా పాల్గొన్నారు.

### ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి



హరే నామ సంకీర్తన చేస్తున్న ఇస్కాన్ సభ్యులు

**కర్నూలు కల్చరల్:** ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు సూచించారు. స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత శిక్షణ తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు కార్యక్రమాలు జరిగాయి. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత పఠనం, శ్రవణం ఉత్తమ జీవితానికి మార్గం చూపుతుందన్నారు. సమయం సద్వినియోగం చేసుకుంటూ దేవాలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాలను సందర్శించాలన్నారు. ప్రవచన కర్తల సందేశాన్ని విని ఆచరించాలన్నారు. హరే రామ హరే కృష్ణ జప యజ్ఞాన్ని చేయించి హరినామ సంకీర్తనలు ఆలపించారు. అనంతరం జగన్నాథ్, బలదేవ్, సుభద్రలకు రాజ భోగ నివేదన చేసి అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు.

### ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



భరతనాట్య ప్రదర్శనలో కళాకారులు

**మంత్రాలయం:** ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంలో బెంగళూరుకు చెందిన కళాకారుల భరతనాట్య పదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆదివారం ప్రవచన మండపంలో కళాకారులు బిందూ శంకర్, అధితి జగదీష్ భరతనాట్య ప్రదర్శన కనువిందు చేసింది. భక్తి పూర్వక సంకీర్తనలకు నాట్య భంగిమలు భక్తులను అలరించాయి.

### ప్రారంభం

**కర్నూలు (టౌన్):** నగరంలోని బంగారు పేట సమీ పంలో ఆదివారం ఎద్దుల కాటన్ షోరూమ్ ప్రారంభమైంది. సినీనటుడు సుమన్, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ కర్నూలు పార్లమెంట్ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్ ఎస్వీ మోహన్‌రెడ్డి, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ విజయమనోహరి హాజరై షోరూమ్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు ఎద్దుల మహేశ్వరరెడ్డి, సూర్యరెడ్డి, సత్యారెడ్డి పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం జగనన్నతోనే సాధ్యం

- వైఎస్సార్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఏఎండీ ఇంతియాజ్



మాట్లాడుతున్న కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్



సభకు హాజరైన బీసీలు



కర్నూలు అభ్యర్థి ఇంతియాజ్ ఆధ్వర్యంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

**కర్నూలు (టౌన్):** సామాజిక న్యాయం జగనన్న తోనే సాధ్యమ వైఎస్సార్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఏఎండీ ఇంతియాజ్ అన్నారు. ఆదివారం స్థానిక నరసింగరావు పేటలోని పార్టీ కార్యాలయంలో పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవపూజ ధనుంజయ్య ఆచారి ఆధ్వర్యంలో బీసీ కులాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ తమ పార్టీ బీసీలు బ్యాక్ బోన్ లాంటి వారన్నారు. ఇచ్చిన హామీలన్ని నెరవేర్చిన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని కోరారు. కర్నూలు పార్లమెంట్ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్ ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి కావాలంటే జగనన్న ప్రభుత్వమే మరోసారి రావాలన్నారు. కర్నూలును సుందరనగరంగా తీర్చిదిద్దాలంటే ఎమ్మెల్యేగా ఇంతియాజ్‌ను, ఎంపీగా బీవై రామయ్యను గెలిపించాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారయణమ్మ మాట్లాడుతూ బీసీలను చంద్రబాబు మోసం చేశారన్నారు. జగనన్న ప్రభుత్వంలోనే బీసీలు అభివృద్ధి సాధించారన్నారు. మంచి చేసిన జగనన్నను గెలిపించుకుందామని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్ర బోస్ మాట్లాడుతూ వ్యాపార వేత్త అయిన టీజీ భరత్ కంటే పాలనా అనుభవం ఉన్న ఇంతియాజ్‌ను గెలిపించుకుంటేనే కర్నూలు అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గడ్డం రామక్రిష్ణ, బీసీ సంఘం నాయకులు శేషు యాదవ్, బత్తుల లక్ష్మీకాంతయ్య, పార్టీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరీ నాయుడు, డీకే రాజశేఖర్, సత్యం యాదవ్, చంద్రకళాబాయి, పద్మశాలి రాజశేఖర్, వీరశైవ లింగాయత్ నాయకులు అభిమానులు పాల్గొన్నారు. అంతకు ముందు ప్రతాప్ ఆధ్వర్యంలో హిందూ బీసీ సంఘం ఆధ్వర్యంలో పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి కండువాలు ఇంతియాజ్ కండువాలుఙ వేసి ఆహ్వానించారు.

### వైస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఇంతియాజ్, ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఏఎండీ ఇంతియాజ్, పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్య విజయానికి కృషి చేస్తామని మెగాస్టార్ చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పుట్టా శివకుమార్ తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంతియాజ్, ఎస్వీ మోహన్‌రెడ్డితో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు ప్రకటించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రమేష్ బాబు, ప్రతాప్ పాల్గొన్నారు.

### ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి



ఓటు వేయాలని కోరుతున్న సిట్రా సత్యనారయణమ్మ

ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారయణమ్మ కోరారు. బిర్లాగేట్, దేవనగర్ కాలనీలలో ఆమె ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగనన్న మేనిఫెస్టో ప్రతులు అందజేశారు. కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఏఎండీ ఇంతియాజ్, పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్యలను గెలిపించాలని కోరారు. ప్రచారంలో పార్టీ సీనియర్ నాయకులు గడ్డం రామక్రిష్ణ, ఓసీఎం రంగా, సురేష్, శేఖర్ రెడ్డి, మున్నా, మధు, సాగర్, బజారీ, శంకర్, శ్రీకాంత్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# విష్ణు అడ్డాలో వైఎస్సార్‌సీపీ ప్రచార హోరు!



సుంకేసులలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్



ఆర్.కె దుద్యాలలో మాట్లాడుతున్న సతీష్, కోట్ల హర్షవర్ధన్ రెడ్డి

- సమస్యలు విన్నవించుకున్న పలు గ్రామాల ప్రజలు
- గెలిచిన వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన నేతలు

**కర్నూలు సిటీ:** తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ ఎంపీపీ డి.విష్ణువర్ధన్‌రెడ్డి అడ్డాలో వైఎస్సార్‌సీపీ ప్రచారం జోరుగా సాగుతోంది. అతని వల్ల అణిచివేతకు గురైన కర్నూలు రూరల్ మండల పరిధిలోని తొలిశాపురం, సుంకేసుల, ఆర్.కె దుద్యాల, ఎదురూరు, ఆర్.కొంతలపాడు గ్రామాల్లో ఆదివారం కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డితో కలిసి వైఎస్సార్‌సీపీ కోడుమూరు అసెంబ్లీ అభ్యర్థి డార్టర్ ఆదిమూలపు సతీష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎన్నికల ప్రచారానికి వెళ్లకూడదని హుకుం జారీ చేసినా పెద్ద ఎత్తున అన్ని వర్గాల ప్రజలు హాజరై తమ సమస్యలు విన్నవించుకున్నారు. ప్రజలనుద్దేశించి సతీష్, హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడారు. గెలిచిన వెంటనే గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎలాంటి సమస్య వచ్చిన పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎవరికీ భయపడకుండా స్వేచ్ఛగా జీవించే వాతావరణం కల్పిస్తామన్నారు. ఇకపై అభివృద్ధి నిరోధకుల ఆటలు సాగనిచ్చేది లేదన్నారు. ప్రజల మధ్య చిచ్చు పెట్టి చలి కాచుకునే నాయకులు కా వాలో? ప్రశాంత వాతావరణం కల్పించే నాయకులు కావాలో ఆలోచించి ఓటేయాలని కోరారు.

**వరద ముంపు కాలనీలోని భూముల పరిశీలన**

తుంగభద్ర నదికి 2009లో వచ్చిన వరద నీటి ముంపుతో సుంకేసుల గ్రామంలో ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని కొందరు ఫిర్యాదు చేయడంతో సతీష్, హర్షవర్ధన్‌రెడ్డి వరద ముంపు కాలనీకి వెళ్లి భూములను పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ నాయకులను గెలిపిస్తే కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల తర్వాత ఆర్.కె దుద్యాలకు రోడ్డు వేయిస్తామని, డ్రైనేజీలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఎదురూరు, ఆర్.కొంతలపాడు గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు అత్యంత ప్రాధాన్య ఇస్తామని సతీష్ వివరించారు. ప్రచారంలో జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్, పార్టీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ నెహిమియా, మాజీ ఎంపీపీ డి.వాసు, సింగిల్ విండో చైర్మన్లు అమర్నాథ్‌రెడ్డి, శేషిరెడ్డి, వంశీకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు హనుమంతు, రాంనాథ్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చిన్నలక్ష్మన్న, బి.తాంద్రపాడు శేఖర్, మోహన్‌బాబు, కురువ మధు, హనుక్, వీరారెడ్డి, ఎదురూరు వెంకటేశ్వర్లు, సయ్యద్, శివ శంకర్ నాయుడు, ఎస్సీ సెల్ కార్యదర్శి ప్రసాద్, నాయకులు బి.వెంకటేష్, అబాన్‌బాషా, గొందిపర్ల గోపాల్, పంచలింగాల వెంకటేశ్వరరెడ్డి, అబ్రహాం, సామేలు, సునీల్ రంగన్న, బొజ్జన్న, కేశవరెడ్డి, ప్రభుదాస్, మద్దిలేటి, భాస్కర్, పాల్గొన్నారు.

## పొరపాట్లకు తావివ్వద్దు

- కర్నూలు అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ భార్గవ్‌తేజ



మాట్లాడుతున్న రిటర్నింగ్ ఆఫీసర్ భార్గవ్‌తేజ

**కర్నూలు (టౌన్):** పెసిలిటేషన్ సెంటర్‌లో పొరపాట్లుకు తావులేకుండా విధులు నిర్వర్తించాలని కర్నూలు అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ భార్గవ్‌తేజ సూచించారు. ఆదివారం ఎ.క్యాంపు ఇందిరాగాంధీ స్మారక నగరపాలక ఉన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. ఫెసిలిటేషన్ సెంటర్‌లో తాగునీరు, ఎండ తీవ్రంగా ఉండటంతో టెంట్లు, టాయ్‌లెట్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఉద్యోగులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం నగరపాలక కార్యాలయంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లతో సమావేశం నిర్వహించి పోలింగ్ ముందు రోజు, తరువాత పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలన్నారు.

### సీపీఎం అభ్యర్థి ఇంటింటా ప్రచారం

**కర్నూలు(సెంట్రల్):** పాణ్యం అసెంబ్లీ సీపీఎం అభ్యర్థి డి.గౌస్‌దేశాయ్ ఇంటింటా ప్రచారాన్ని ఉధృతం చేశారు. ఆదివారం నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీ, ఎన్‌టీఆర్ బిల్డింగ్స్, నేతాజీ హౌ సింగ్ కాలనీలలో ప్రచారం నిర్వహించారు. తన ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే తాగునీటి సమస్య లేకుండా చేస్తానని,శ్మశానాన్ని నిర్మిస్తానని హామీ ఇచ్చా రు. కార్యక్రమంలో నాయకులు టి.రాముడు. పి.నిర్మల, పీఎస్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

### ఇంతియాజ్‌ను గెలిపించండి



ప్రచారం చేస్తున్న ఏపీ ఐడీసీ డైరెక్టర్ సత్యం యాదవ్

**కర్నూలు (టౌన్):** వైఎస్సార్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్‌ను గెలిపించాలని ఏపీ ఐడీసీ డైరెక్టర్ సత్యం యాదవ్ కోరారు. ఆదివారం బంగారుపేట, కేఈ మాదన్న నగర్, గాజుల గేరిలలో ఇంటింటికి వెళ్లి, జగనన్న మేనిఫెస్టో ప్రతులను పంపిణీ చేసి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో నాయకులు మనివర్ధన్ రెడ్డి, సోమన్న, శరత్, రమణ, అల్లీపీర, మేస్త్రీ సత్యం పాల్గొన్నారు.

## వడ దెబ్బతో శరీర వ్యవస్థ దెబ్బతింటుంది

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్



ఓఆర్ఎస్ ద్రావణంపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

**కర్నూలు(హాస్పిటల్):** వడదెబ్బ కారణంగా మనిషి శరీర ఉష్ణోగ్రత నియంత్రించే వ్యవస్థ దెబ్బతింటుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. ఆదివారం ఆయన బస్టాండ్‌ను సందర్శించి ప్రయాణికులకు సూచనలు, సలహాలు అందజేశారు. జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోవుతుండటంతో బయటకు వెళ్లేటప్పుడు ఎండ దెబ్బ తగలకుండా గొడుగులు, టవల్, రుమాలు తప్పనిసరిగా వాడాలన్నారు. అత్యవసరమైతేనే బయటకు రావాలని, గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్నపిల్లలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెవిలోకి వేడి గాలి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తల వద్ద, అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. వడదెబ్బకు గురైన వారికి అత్యవసర వైద్యచికిత్స అందించాలని, లేకపోతే ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుందన్నారు. వడదెబ్బకు గురైన వారిని మొదట చల్లని నీటితో కానీ, నీటిలో ముంచిన వస్త్రంతో కానీ శరీరం మొత్తం మర్దన చేయాలన్నారు. ఉప్పు కలిపిన నీరు, మజ్జిగ, నిమ్మరసం, ఓఆర్ఎస్ తాగించాలని సూచించారు. ఇవన్నీ చేస్తూనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి దగ్గరలోని ఆసుపత్రికి తీసుకెళ్లి సరైన వైద్య చికిత్స అందేలా చూడాలన్నారు.

## హాస్యంతో మానసిక ఆనందం



మాట్లాడుతున్న డాక్టర్ బి.శంకరశర్మ

**కర్నూలు(హాస్పిటల్):** హాస్యంతో మానసిక ఆనందం లభిస్తుందని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎ.క్యాంపులోని హెల్త్ క్లబ్‌లో వరల్డ్ లాఫింగ్ డే నిర్వహించారు. నవ్వు వల్ల ఉపయోగాల గురించి లాఫింగ్ స్పెషలిస్టు సలీం బాషా వివరించారు. అనంతరం డాక్టర్ శంకరశర్మ మాట్లాడుతూ నవ్వడం వల్ల శరీరంలో మంచి హార్మోన్లు విడుదలవుతాయన్నారు. దీనివల్ల మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుందని, ఫలితంగా శారీరక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యం వల్ల శరీరంలో జీర్ణక్రియలు మెరుగుపడతాయని, తద్వారా ఆహారం వంటబట్టి ఆరోగ్యం చేకూరుతుందని చెప్పారు. హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ నిత్యం నవ్వుతూ హాయిగా ఉండటం వల్ల గుండె ఆరోగ్యం బాగుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ జీవితంలో హాయిగా నవ్వడం అలవాటు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎస్‌పీ డీఎస్పీ మహబూబ్‌బాషా, ఫౌండేషన్ ఉపాధ్యక్షులు కల్కూర చంద్రశేఖర్, డాక్టర్ భవానీప్రసాద్, పోతన తదితరులు పాల్గొన్నారు.

## రోబోటిక్ టెక్నాలజీతో మోకాలి మార్పిడి శస్త్రచికిత్స



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి

**కడప కోటిరెడ్డి సర్కిల్:** రాయలసీమలో మొట్టమొదటిసారిగా కడపలోని విద్యా సాగర్ హాస్పిటల్‌లో రోబోటిక్ టెక్నాలజీ ఉపయోగించి 100 మోకాలి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఆదివారం ఆస్పత్రిలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం విద్యాసాగర్ ఆస్పత్రి అధినేత డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి మాట్లాడుతూ 2009లో కడపలో సంప్రదాయ పద్ధతిలో మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు ప్రారంభించి మెరుగైన ఫలితాల కోసం 2019లో కంప్యూటర్ నావిగేషన్ టెక్నాలజీ ని పరిచయం చేసినట్లు చెప్పారు. అత్యాధునిక ప్రపంచస్థాయి రోబోటిక్ టెక్నాలజీని 2024లో రాయలసీమలో మొదటిసారి కడప నగరానికి తీసుకొచ్చినట్లు వివరించారు. ఊబకాయం ఉన్నవారు, ఎక్కువ మోకీలు అరుగుదల ఉన్న వారు, తక్కువ వయసులో మోకీలు మార్పిడి అవసరమైన వారు, మోకీలు వద్ద మెటల్స్ ఉన్నవారు ఈ టెక్నాలజీ ద్వారా మెరుగైన ప్రయోజనాలు పొందవచ్చని వివరించారు. కొన్నేళ్లుగా 6,000 లకు పైబడి మోకీల శస్త్రచికిత్స చేసిన అనుభవవంతోపాటు అత్యాధునిక ప్రపంచస్థాయి రోబోటిక్ టెక్నాలజీ వినియోగంతో మరింత సత్ఫలితాలు సాధించామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీలక్ష్మి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### నందీశ్వరుడికి ప్రదోషకాల అభిషేకం

**మహానంది:** మహానందిలో కొలువైన శ్రీ మహానందీశ్వరస్వామి గర్భాలయం ఎదురుగా ఉన్న నందీశ్వరుడికి ఆదివారం, బహుళ త్రయోదశి పురస్కరించుకుని ప్రదోష కాలంలో సాయంత్రం ప్రదోషకాల అభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, పండితులు ముందుగా గణపతిపూజ, కలశపూజ, నందీశ్వర ఆహ్వానం, పీఠార్చన పూజలు చేశారు.

## ఆగస్టులో వీహెచ్‌పీ షష్టబ్ధి ఉత్సవాలు



మాట్లాడుతున్న వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి రాముడు

**కర్నూలు కల్చరల్:** విశ్వ హిందూ పరిషత్ షష్టబ్ధి ఉత్సవాలు ఆగస్టులో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు తెలిపారు. ఆదివారం స్థానిక భరత మాత ఆలయంలో ఏర్పాటు చేసిన ఉత్సవాల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామంలో కనీసం ఐదుగురితో వీహెచ్‌పీ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. హిందూ సామాజిక ధార్మిక సంస్థగా ఏర్పడి సేవా, సురక్ష, సంస్కార్ నినాదాలతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాదికి 60 ఏళ్లు పూర్తి కావడంతో షష్టబ్ది ఉత్సాల నిర్వహణలో భాగంగా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. వీహెచ్‌పీ నగర అధ్యక్షులు టీసీ మద్దిలేటి మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు తీసుకునే కార్యకర్తలు తమ సమయాన్ని దేశం, ధర్మం కోసం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర కోశాధికారి సందడి మహేశ్వర్, రాష్ట్ర సహ సేవా కన్వీనర్ గురుమూర్తి, జిల్లా కార్యదర్శి భానుప్రకాష్, సహ కార్యదర్శులు గిరిబాబు, గోవిందరాజులు, ఈపూరి నాగరాజు పాల్గొన్నారు.

### బావను హత మార్చిన బావమరిది



మృతి చెందిన కిరణ్

**రుద్రవరం:** స్థానిక ఎస్సీ కాలనీలో బావను రోకలి బండతో మోది హతమార్చిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కాలనీకి చెందిన కిరణ్ (32)ఆతని భార్య ప్రణతి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో శనివారం రాత్రి వారి మధ్య వాగ్వావాదం నెలకొంది. తరచూ గొడవ జరుగు తుండటంతో ఆమె డబ్ల్యూ కొత్తపల్లెలో ఉన్న తన అన్న శీనుకు సమాచారం ఇచ్చింది. ఆయన గ్రామానికి వచ్చి తన చెల్లెలి వేధిస్తావా అంటూ బావపై రోకలి బండతో మోదాడు. తలకు తీవ్ర గాయం కాగా స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేయించి ఇంటికి తీసుకెళ్లగానే కిరణ్ మృతి చెందాడు. మృతుడి తల్లి భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.



నోరూరించే మిఠాయి దుకాణం



ఎద్దుల బండ్లు



కడ్డీ మాంసం

# జాతర సందడి

తిమ్మగురుడుస్వామి జాతర సందర్భంగా ఆదివారం పట్టణంలో సందడి నెలకొంది. ఎద్దుల బండ్లు, వ్యవసాయ పరికరాలు జాతరలో అమ్మకానికి ఉంచారు. వ్యవసాయ ఉత్పత్తులు, పరికరాల క్రయవిక్రయదారులతో కిటకిటలాడింది. చిన్నపిల్లల ఆట వస్తువులు, బొమ్మలు కొనుగోలు చేశారు. గాజులు, కుంకుమ దుకాణాల వద్ద మహిళల తాకిడి కనిపించింది. ఇక గూడూరు జాతర అంటే గుర్తుకొచ్చేది కడ్డీ మాంసం. అధిక శాతం జనం కేవలం కడ్డీ మాంసం రుచి చూసేందుకే ఇక్కడికి వస్తుంటారు.

– గూడూరు



గాజుల అంగళ్లు



కుంకుమ అంగడి



వ్యవసాయ పరికరాలు



ఉయ్యాలలు...జంపాలు